ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 212 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 12 నవంబర్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# నవీన్ యాదవ్‌కు భారీ మెజార్టీ

## తిరుగులేని ఆధిక్యంతో కాంగ్రెస్ విజయం

### క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనించాం

### పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ ధీమా

హైదరాబాద్, నవంబర్ 11(ప్రభాత ఉదయం)

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో...కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు భారీ మెజారిటీ వస్తుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ తిరుగులేని ఆధిక్యంతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ జరిగిన తీరు, క్షేత్ర స్థాయిలో తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు చెబుతున్న సమాచారం మేరకు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు భారీ మెజారిటీ వస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సరళిపై ఆయన మొదటి పేజీ తరువాయి...

స్పందించారు. చాలా ప్రశాంతంగా ఉప ఎన్నిక జరిగిందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున తమ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇచ్చి నట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, అభ్యర్థికి మద్దతు ఇచ్చినట్లుగా అక్కడ ఉన్న తమ నాయకుల ద్వారా తెలుస్తోందని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ మహేశ్ కుమార్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... రెగ్యులర్‌గా పర్యవేక్షిస్తూ అందరికీ సలహాలు, సూచనలు ఇస్తూ ముందుకు నడి పించారని కొనియాడారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మం త్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, మహిళ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ విభాగాలతో పాటు సీనియర్ నాయకులు అందరూ ప్రభుత్వ పథకాలను జనం లోకి తీసుకెళ్లడంలో విజయవంతం అయ్యారన్నారు. తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉండటంతో.. తమ అభ్యర్థికి పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. భారీ మెజారిటీతో తమ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# అక్షరయోధుడికి కన్నీటి వీడ్కోలు



## ఘట్‌కేసర్‌లో అందెశ్రీ అంత్యక్రియలు పూర్తి

## పాడె మోసిన సీఎం రేవంత్‌రెడ్డి

## వేల సంఖ్యలో తరలివచ్చిన సాహితీవేత్తలు, అభిమానులు

## అందెశ్రీకి 'పద్మశ్రీ' పురస్కారం ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతామన్న సీఎం

అందెశ్రీ పాడె మోస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్

హైదరాబాద్, నవంబర్ 11(ప్రభాత ఉదయం)

హైదరాబాద్- ఘట్‌కేసర్, లాలాపేట, న్యూస్‌టుడే: అక్షర యోధుడు, సహజ కవి అందెశ్రీ(64) అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య ముగిశాయి. అధికార లాంఛనాలతో ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో మంగళవారం మధ్యాహ్నం ఆయన కుమారుడు దత్తు... అంతిమ సంస్కారాలు పూర్తిచేశారు. పోలీసులు గాలిలోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపి 'గార్డ్ ఆఫ్ ఆనర్' సమర్పించారు. ఉదయం హైదరాబాద్ లాలాపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్ ఎన్ఎఫ్‌సీనగర్ వరకు అంతిమయాత్ర సాగింది. ఘట్‌కేసర్ నుంచి ఖననం చేసే ప్రదేశం వరకు సీఎం రేవంత్‌రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్నారు. అనంతరం పాడె మోసి... అందెశ్రీపై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. సీఎంతోపాటు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కూడా పాడె మోశారు. అందెశ్రీ ఆకస్మిక మరణంతో బరువెక్కిన హృదయాలతో ఉన్న ఆయన కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి ఓదార్చారు. అంతిమ సంస్కారాలు పూర్తయ్యే వరకు అక్కడే ఉన్నారు. అంతకుముందు వేల సంఖ్యలో తరలివచ్చిన ఉద్యమకారులు, సాహితీవేత్తలు, అభిమానులు ఉద్యమ గీతాలు, డప్పు దరువుల మధ్య అక్షరయోధుడికి



# బీహార్‌లో మళ్లీ ఎన్డీయే ప్రభంజనం

## ముక్తకంఠంతో చెబుతున్న ఎగ్జిట్ పోల్స్!

## ముగిసిన రెండో విడత పోలింగ్

## ఎగ్జిట్ పోల్స్ వెల్లడి.. ఎన్డీయేకు భారీ మెజారిటీ అంచనా

## మహాగట్బంధన్‌కు నిరాశ తప్పదంటున్న సర్వేలు

## పనిచేయని ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' ఫ్యాక్టర్

## ఎన్డీయే వైపు భారీగా మొగ్గు

న్యూఢిల్లీ, నవంబర్ 11 (ప్రభాత ఉదయం)

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే మరోసారి ఘన విజయం సాధించబోతోందని ఎగ్జిట్ పోల్స్ ముక్తకంఠంతో చెబుతున్నాయి. మంగళవారం రెండో విడత పోలింగ్ ముగిసిన వెంటనే వెలువడిన దాదాపు అన్ని సర్వేలు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకే అధికారాన్ని కట్టబెట్టాయి. ఆర్జేడీ-కాంగ్రెస్ కూటమి అయిన మహాగట్బంధన్ కూటమికి తీవ్ర నిరాశ తప్పదని అంచనా వేశాయి. వివిధ జాతీయ సర్వే సంస్థలు విడుదల చేసిన ఎగ్జిట్ పోల్స్ ప్రకారం, ఎన్డీయేకు 130 నుంచి 167 సీట్ల వరకు దక్కే అవకాశం ఉంది. మరోవైపు, మహాగట్బంధన్ కూటమి 70 నుంచి 108 స్థానాల మధ్య పరిమితం కావొచ్చని తెలుస్తోంది. బీహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి 122 సీట్ల మేజిక్ ఫిగర్ అవసరం కాగా, ఎన్డీయే సునాయాసంగా ఆ మార్కును దాటుతుందని ..మిగతా 2లో

# మొంథా తుపానుతో 1,17,757 ఎకరాల్లో పంట నష్టం



హైదరాబాద్, నవంబర్ 11(ప్రభాత ఉదయం)

అత్యధికంగా 83,407 ఎకరాల్లో దెబ్బతిన్న వరి, తర్వాత పత్తి 30,144, మొక్కజొన్నకు 2,097 ఎకరాలలో నష్టంరాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ తుది నివేదిక.. త్వరలో ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఎన్‌డీఆర్ఎఫ్ కింద కేంద్రం నుంచి పరిహారం కోరాలని రాష్ట్ర సర్కారు నిర్ణయం

హైదరాబాద్: అక్టోబర్ చివరి వారంలో రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన మొంథా తుపాను కారణంగా జరిగిన నష్టం తుది నివేదికను వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి అందించింది. ఈ తుపాను కారణంగా 27 జిల్లాల్లోని 1,22,242 మంది రైతులకు చెందిన 1,17,757 ఎకరాలలో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్లు ఆ నివేదికలో వెల్లడించింది. తుపాను అనంతరం వ్యవసాయ శాఖకు చెందిన క్షేత్రస్థాయి ఏఈవోలు 4,47,864 ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్నతో పాటు వివిధ రకాల పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపించారు. కాగా, వరి పొలాలు, పత్తి చేనుల్లో నిలిచిన నీటిని బయటకు పంపించిన అనంతరం జరిపిన సర్వే ద్వారా ఆయా జిల్లాల్లో జరిగిన నష్టంపై తుది నివేదికను వ్యవసాయ శాఖ రూపొందించింది. ఇందులో అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 21,408 మంది రైతులకు చెందిన 23,580 ఎకరాల విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నట్లు తేల్చారు.

ఆ తరువాత వరంగల్‌లో 19,736 ఎకరాలు, కరీంనగర్‌లో 11,473 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఉమ్మడి జిల్లాల పరంగా చూస్తే వరంగల్ పూర్వ జిల్లా పరిధిలోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగాం జిల్లాల్లో కలిపి సుమారు 40వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది.



# ఎర్రకోట మూసివేత

న్యూఢిల్లీ, నవంబర్ 11 (ప్రభాత ఉదయం)

దేశ రాజధానిలో ఉన్న ఎర్రకోట సవిరీపంలో సోమవారం రాత్రి ఏడు గంటలకు కారు పేలుడు ఘటన నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేశారు. రాబోయే మూడు రోజుల పాటు సందర్శకులకు ఎర్రకోట బంద్ ఉంటుందని అధికారులు చెప్పారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా దీనిపై ప్రకటన చేసింది. కారు బాంబు పేలుడు జరిగిన ప్రదేశంలో ప్రస్తుతం ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరుగుతున్నది. అయితే ప్రజలు భారీ స్థాయిలో గుమ్మికూడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎర్రకోటను బంద్ చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రకటించింది. కారు పేలుడుకు, ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్‌కు లింకు ఉన్నట్లు ప్రాథమిక విచారణ ద్వారా వెల్లడవుతున్నది. పేలడు కోసం డిటోనేటర్లు వాడినట్లు అనుమానిస్తున్నారు. అమోనియం న్కెట్రేట్ రసాయనం వాడి ఉంటారని భావిస్తున్నారు.

# మంటల్లో ట్రావెల్స్ బస్సు



## ఇంజన్‌లో సాంకేతిక లోపంతో ప్రమాదం

## ప్రయాణికులను అప్రమత్తం చేసి కిందకు దింపిన డ్రైవర్

హైదరాబాద్, నవంబర్ 11(ప్రభాత ఉదయం)

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఇంజన్‌లో సాంకేతిక లోపంతో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. విహారి ట్రావెల్స్‌కు చెందిన ఈ స్లీపర్ కోచ్ బస్సు సోమవారం రాత్రి 12 గంటల తరువాత హైదరాబాద్ నుంచి నెల్లూరు జిల్లా కొండాపురం గ్రామానికి 29 మంది ప్రయాణికులతో బయలుదేరింది. జాతీయ రహదారిపై చౌటుప్పల్ శివారులోకి రాగానే టీ బ్రేక్ కోసం బస్సును కాసేపు ఆపారు. అనంతరం బస్సు రాత్రి 1.30 గంటల సమయంలో నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ పరిధిలోకి రాగానే ఇంజన్‌లో పొగ రావటాన్ని డ్రైవర్ గమనించాడు. దీంతో బస్సును రహదారి పక్కన నిలిపివేసి, ప్రయాణికులను అప్రమత్తం చేశాడు. ప్రయాణికులు బస్సు ప్రధాన ద్వారంతో పాటు వెనక ఉన్న ఎమర్జెన్సీ డోర్ గుండా బయటకు వచ్చారు. కొద్దిసేపట్లోనే మంటలు బస్సు మొత్తం వ్యాపించాయి. డీజిల్ ట్యాంకులో నిండుగా డీజిల్ ఉండటంతో మంటలు పెద్ద ఎత్తున లేచి బస్సు పూర్తిగా దగ్ధమైంది.

# అక్షరయోధుడికి కన్నీటి వీడ్కోలు

**మొదటి పేజీ తరువాయి...**

ఘన నివాళి అర్పించారు. అరుణోదయ బృందంతో విమలక్క ఉద్యమ గీతాలు ఆలపించారు.

పాఠ్యపుస్తకాల్లో 'జయ జయహే తెలంగాణ'

అంతిమ సంస్కారాలు పూర్తయ్యాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... "ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో అందెశ్రీ గొప్ప పాత్ర పోషించారు. ఆయన రాసిన 'జయ జయహే తెలంగాణ.. జననీ జయకేతనం' గీతాన్ని పాఠ్యపుస్తకాల్లో ప్రథమ అంశంగా చేర్చుతాం. రానున్న క్యాబినెట్ సమావేశంలో మంత్రుల సహకారంతో ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటాం. తన గళాన్ని తెలంగాణకు అంకితం చేసిన అందెశ్రీ కుటుంబం ఎన్నో సమస్యలు ఎదుర్కొంటోంది. ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తాం. ఆయన్ను ఖననం చేసిన ప్రాంతాన్ని స్మృతివనంగా తీర్చిదిద్దుతాం. అందెశ్రీ రచించిన 'నిప్పులవాగు' పుస్తకం 20 వేల ప్రతులను ప్రభుత్వ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతాం. ఈ పుస్తకం యువతకు, ఉద్యమకారులకు, సమస్యలపై పోరాడే వారికి దిక్సూచిలా పనిచేస్తుంది. తెలంగాణ కోసం జీవితాన్ని



త్యాగం చేసిన అందెశ్రీని 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించుకోవాల్సిన అవసరముంది. ఈ విషయమై గతంలోనే కేంద్రానికి ప్రతిపాదన పంపాం. మరోసారి ప్రధాని మోదీని కోరుతాం. ఇందుకు కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కూడా చొరవ చూపాలి. అందెశ్రీని కోల్పోవడం నాకు, నా కుటుంబానికి తీరని లోటు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆయన్ను కలవడానికి ప్రయత్నిస్తే నిరాకరించారు. రాజకీయ పార్టీల వ్యక్తులను వేదికలపైనే కలుస్తానని, వ్యక్తిగతంగా కలవనని చెప్పిన గొప్ప వ్యక్తి అందెశ్రీ. ఆయనతో మాట్లాడుతున్నప్పుడు పట్టణంలో చదువుతున్న తమ్ముడిని కలవడానికి... ఊర్లో వ్యవసాయం చేసే అన్న వచ్చిన అనుభూతి కలిగేది. పరిపాలనలో పేదలకు ప్రయోజనం చేకూర్చాలనే ఆలోచన వచ్చినప్పుడు గద్దరన్నతోపాటు సమానమైన స్ఫూర్తిని అందెశ్రీ నాకు కలిగించారు" అని సీఎం రేవంత్‌రెడ్డి శ్లాఘించారు. అంతిమయాత్రలో మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, పాశం యాదగిరి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బీహార్‌లో మళ్లీ ఎన్డీయే ప్రభంజనం

**మొదటి పేజీ తరువాయి...**

సర్వేలు స్పష్టం చేస్తున్నాయి.ఈ ఎన్నికల్లో ప్రభావం చూపుతారని భావించిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' పార్టీ ఏమాత్రం సత్తా చాటలేకపోయిందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. చాలా సర్వేలు ఆయన పార్టీకి 0 నుంచి 5 సీట్ల లోపే వస్తాయని పేర్కొన్నాయి. దీంతో, బీహార్ రాజకీయాలపై 'పీకే ఫ్యాక్టర్' పనిచేయలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.మ్యాట్రిజ్ ఎగ్జిట్ పోల్ ప్రకారం, మిథిలాంచల్, భాగల్‌పూర్ వంటి ప్రాంతాల్లో ఎన్డీయే ప్రభంజనం సృష్టించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, 65 శాతం మంది మహిళా ఓటర్లు

## పలు కేసుల్లో తనిఖీల్లో పట్టుబడిన మద్యం పారబోసిన పోలీసులు



పటాన్ చెరు, నవంబర్ 11(ప్రభాత ఉదయం): గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో నిర్వహించిన దాడుల్లో బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు చేసిన 25 కేసులకు సంబంధించి పట్టుబడిన మద్యం బాటిళ్ళను న్యాయస్థానం అనుమతులు మేరకు ఎక్సైజ్ అధికారుల సమక్షంలో ఓ నిర్మానుష్య ప్రదేశంలో ఆ మద్యాన్ని పారబోసారు.పట్టుబడిన మద్యం దాదాపు 365 లీటర్లు, వీటి విలువ రెండు లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ కార్యక్రమంలోఎక్సైజ్ ఏఈఎస్ మణెమ్మ, సీఐ పరమేష్ గౌడ్, ఎస్సై రాములు, హెడ్ కానిస్టేబుల్ నందు సింగ్, బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ రవీందర్ రెడ్డి, ఎస్ ఐ కిష్టారెడ్డి,పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

కేటీ దొడ్డి , నవంబర్ 11(ప్రభాత ఉదయం)ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కేటిదొడ్డి మండలం నందిన్నె గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కేటిదొడ్డి ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నందిన్నె గ్రామానికి చెందిన తోలు పెద్ద నరసప్ప అలియాస్ బెల్లమన్నా (50) తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో గ్రామ శివారులో గల కురువ చిన్నయ్య వ్యవసాయ బావిలో స్నానానికి వెళ్లగా ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. మృతుని తమ్ముడు నరసప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



## మున్సిపల్ ఇనుప తుక్కు బహిరంగ వేలం

పటాన్ చెరు,నవంబర్ 11 (ప్రభాత ఉదయం): నిరుపయోగంగా ఉన్న బొల్లారం మున్సిపల్ ఇనుప పరికరాలను తుక్కు రూపంలో మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు.బొల్లారం మున్సిపాలిటీలో ఉన్న తుక్కు ను బహిరంగ వేలం వేయుటకు ఈనెల 3వ తేదీ న ఈఓఐ ద్వారా దరఖాస్తులు స్వీకరించుటకు విడుదల చేసిన ఉత్తర్వులకు స్పందిస్తూ ఐదు మంది వేలం దారులు వేలం పాటలో పాల్గొన్నారు. ఈ బహిరంగ వేలంలో పాల్గొనుటకు వెయ్యి రూపాయలు దరఖాస్తు రుసుము చెల్లించి , డిడి రూపంలో యాభై వేల రూపాయలు చెల్లించి దరఖాస్తులు సమర్పించిన నేపథ్యంలో, మంగళవారం ఉదయం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్ బి కిషన్ ఆధ్వర్యంలో తుక్కు బహిరంగ వేలం నిర్వహించడం జరిగింది.ఇనుప తుక్కు కిలో ఒకటికి ఇరవై ఐదు రూపాయల చొప్పున కనీస ధర నిర్ణయించి బహిరంగ వేలం నిర్వహించగా ఐదు మంది దరఖాస్తుదారులు వేలంపాటలో పాల్గొనగా అబ్దుల్ వాహెద్ అత్యధికంగా ఒక కిలో కు ఇరవై ఆరు రూపాయల యాభై పైసలు రేటుకు వేలం పాడి తుక్కు కొనుగోలు హక్కులు పొందడం జరిగింది. మున్సిపాలిటీలో నిరుపయోగంగా ఉన్న వాహనాలను మరియు తుప్పు పట్టి ఉన్న వాహనాలు మరియు ఇనుప వస్తువులను తూకం వేసిన అనంతరం వచ్చిన తూకానికి ఈ వేలంలో నిర్ణయించిన తుది రేటు చొప్పున డిడి రూపంలో చెల్లించిన అనంతరం సదరు పాట హక్కు దారునికి తుక్కు ను స్వాధీన పరచుకొనుటకు నిర్ణయించారు. ఈ వేలం పాటలో డిప్యూటీ ఇంజనీర్ సత్యనారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్ కిష్టయ్య, మేనేజర్ మల్లికార్జున స్వామి, రెవిన్యూ ఆఫీసర్ టి నరసింహులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వెంగళరావు నగర్‌లో పోలింగ్ బూత్‌లను సందర్శించిన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్



కూకట్ పల్లి, నవంబర్ 11 (ప్రభాత ఉదయం) టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని వెంగళరావునగర్ మధుర నగర్ లలో స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఉప ఎన్నిక ఓటింగ్ సరళి ఆయన పరిశీలించారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లతో ఆయన మాట్లాడారు. ఓటింగ్ సమయంలో ఏమన్నా ఇబ్బందులు ఎదుర్కొన్నారా అంటూ వారిని ప్రశ్నించారు. పార్టీ కార్యకర్తలకు ఓటు వేసే విషయంలో అవసరమైన సలహాలు సూచనలు అందజేశారు. పార్టీకి చెందిన ఓట్ల తో పాటు తటస్థ ఓట్లను పార్టీకి పడేలా చూడాల్సిందిగా కార్యకర్తలకు ఆయన సూచించారు. మొత్తం మీద ఉపఎన్నిక సజావుగా, శాంతియుత వాతావరణంలో ముగిసేలా పార్టీ కార్యకర్తలు కృషి చేసినందుకు ఆయన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తూము వేణు, కృష్ణ రాజపూత్ ,ప్రకాష్, అస్లాం ,రాజు తదితరులు ఉన్నారు.



మున్సిపల్ కార్యాలయ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ బి చంద్రశేఖర్

## ప్రజల సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించండి:సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ బి చంద్రశేఖర్

పటాన్ చెరు, నవంబర్ 11 (ప్రభాత ఉదయం): గడ్డపోతారం మున్సిపల్ కార్యాలయాన్ని సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ బి చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని ప్రాథమిక పాఠశాల కు వెళ్లే దారి టాంకర్ల రవాణా ద్వారా ధ్వంసం అయిన నేపథ్యంలో ఆరోడ్డును పరిశీలించి ట్యాంకర్ల యజమానుల సహకారం మరియు సిఎస్ ఆర్ నిధుల తో తారు రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించినారు. అనంతరం గడ్డపోతారం మున్సిపల్ కార్యాలయంను సందర్శించి అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి సాధ్యమైనంత వరకు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పలు సూచనలు చేశారు.మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా మ్యాపింగ్ గురించి ఆరా తీసి ఓటర్ల జాబితా మ్యాపింగ్ ను వంద శాతం పూర్తయ్యే విధంగా బిఎల్వోలు పనిచేయాలని సూచించారు.అదేవిధంగా నూతన మున్సిపాలిటీలో సిటిజన్ సర్వీసు చార్ట్ ఏర్పాటు చేయాలని, సర్వీస్ లాగిన్ల గురుంచి ఆరా తీసారు. ఇట్టి కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఈ. వెంకటరామయ్య ,మేనేజర్ మధుసూదన్ రెడ్డి మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్తీక మాసంలో దీపాన్ని వెలిగించడం వలన మనలోని అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదింప చేస్తుంది


### కూకట్ పల్లి జనసేన పార్టీ అధ్యక్షులు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్



కూకట్ పల్లి, నవంబర్ 11 (ప్రభాత ఉదయం) కార్తీక మాసం పవిత్రమైన మూడవ సోమవారం సందర్భంగా సోమవారం సాయంత్రం ఏ.వి.బి.పురం లోని శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబిక సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ నారాయణ, కాలనీ ప్రెసిడెంట్ సింహాద్రి ఆహ్వానం మేరకు ఆధ్యాత్మిక వాతావరణంలో ఆకాశ దీపం వెలిగించే మహోత్సవ కార్యక్రమమునికి కూకట్‌పల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ ప్రేమ కుమార్ ముఖ్య అతిథిగా హాజరైయారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మాట్లాడుతూ "కార్తీక మాసం అనేది భక్తి, శాంతి, సేవలకు ప్రతీక అని అన్నారు. ఈ నెలలో దీపం వెలిగించడం మనలోని అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానాన్ని ప్రసరింపజేస్తుంది. సమాజంలో సాత్వికత, శుభతను పెంచడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరం," అని అన్నారు. తదనంతరం దేవస్థాన కమిటీ సభ్యులు పెద్దలు ప్రేమ కుమార్ ని శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, కలిగినీడి ప్రసాద్, శివ శంకర్, పోలేబోయిన శ్రీనివాస్, పులగం సుబ్బు, దేవాలయ కమిటీ సభ్యులు గోవింద్, ప్రసాద్, జైరామ్, అనంత్, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు

## కుమ్మరుల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం:

### కుమ్మరసంఘం అధ్యక్షులు నడికుడ జయంత్ రావు



%కుమ్మరలకు సారే చక్రాలను పంపిణీ చేస్తున్న రాష్ట్ర అధ్యక్షులు నడికుడ జయంతి కుమార్

హైదరాబాద్, నవంబర్ 11(ప్రభాత ఉదయం) కుమ్మరుల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలంగాణ రాష్ట్ర కుమ్మరసంఘం అధ్యక్షులు నడికుడ జయంత్ రావు అన్నారు. సంఘం ఆధ్వర్యంలోత్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కుమ్మరులకు సారె చక్రాలని పంపిణి చేయలన్న సంకల్పంతో, కార్యచరణని రూపొందిస్తున్న హైదరాబాదు జిల్లా యువత విభాగం అధ్యక్షులు కొల్లూరి అర్జున్ ,ఇందుకు అంకురార్పణగా తాత నానమ్మ గార్ల జ్ఞాపకార్థం గా,సోషల్ మిడియాలో తన ఇనిస్ట్రాగ్రామ్ ద్వారా అత్యంత ప్రజాదరణ పొందిన మన కుమ్మర ముద్దుబిడ్డ కొడంగల్ కుమ్మర రమేశ్ ని మరింత ప్రోత్సాహించాలన్న, సత్ సంకల్పంతో వారికి సారె చక్రం అందజేశారు.ఈ మద్య సోషల్ మీడియాలో మేము కుమ్మరోల్లం అంటు తనఇ న్ స్టా ద్వారా అత్యంత ప్రాచుర్యం పొందిన మన కుమ్మర ముద్దుబిడ్డ మహబూబ్‌నగర్ జిల్లా కొడంగల్ వాసి కుమ్మర రమేశ్ ని అభినందించిన తెలంగాణ రాష్ట్ర కుమ్మరసంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కుమ్మరి లక్ష్మీ నారాయణ ,రాష్ట్ర ఉద్యోగ విభాగం అధ్యక్షులు శ్రీ శ్యామ్ కుమార్ ,రాష్ట్ర ప్రచారకార్యదర్శి శ్రీ నిమ్మలూరి శ్రీనివాస్ , అధ్యక్షులు చేవెళ్ళ నియోజకవర్గం కన్వినర్ ఎర్నెల్లి శంకర్ , హైదరాబాదు జిల్లా అధ్యక్షులు సందుగారి శ్రీనివాస్ ,హైదరాబాదు జిల్లా యువత విభాగం అధ్యక్షులుకొల్లూరి అర్జున్ ,యువనాయకుడు ప్రమోద్ , రూపేష్‌హాజరైనారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సైబరాబాద్ సీపీ

### కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా రియల్‌టైమ్ మానిటరింగ్

కూకట్ పల్లి, నవంబర్ 11 (ప్రభాత ఉదయం)జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో, ఎన్నికల ఏర్పాట్లు, పోలింగ్ సరళిని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి, ఐపీఎస్, పకడ్బందీగా పర్యవేక్షించారు. మంగళవారం సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలోని ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని శాస్త్రి నగర్, బంజారా నగర్, ఛత్రపతి శివాజీ నగర్, ఓల్డ్ సుల్తాన్పూర్, ప్రేమ్ నగర్లలో ఉన్న పలు పోలింగ్ కేంద్రాలను ఆయన స్వయంగా సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. అంతేకాకుండా, సైబరాబాద్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాల వద్దకు అమర్చిన 19 సీసీటీవీల ద్వారా రియల్ టైమ్ లొకేషన్ వ్యవస్థతో ఎప్పటికప్పుడు పోలింగ్ సరళి పనితీరును సీపీ మొహంతి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీపీ మొహంతి మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లో కొత్త సవాళ్లు ఎదురవుతాయని అన్నారు. ఎన్నికల బందోబస్తు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, సిబ్బంది డిప్లాయ్ మెంట్, కేంద్ర బలగాలతో సమన్వయం తదితర అన్ని అంశాలపై కృషి చేసిన సంబంధిత అధికారులను ఆయన అభినందించారు.జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని ఎర్రగడ్డ డివిజన్‌లో ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని



అధికారులను సీపీ ఆదేశించారు. నివాసాలలో, హెూటళ్లు, లాడ్జీలలో స్థానికేతరులు బస చేయకుండా చూడాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.అధికారులతో మాట్లాడుతూ సీపీ మొహంతి పలు అంశాల గురించి వివరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, సరిహద్దు ప్రాంతాలలో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకునేలా స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు కోసం భద్రత కల్పించాలని ఉద్ఘాటించారు. ఈ విధమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం వల్ల ఎన్నికల నిర్వహణ మరింత సులభతరం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ పర్యవేక్షణలో సీపీ అవినాష్ మొహంతి వెంట బాలానగర్ ఇంచార్జ్ డీసీపీ కోటి రెడ్డి, ఐపీఎస్, అడిషనల్ డీసీపీ (ఎస్బి) రవి కుమార్, బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, సనత్ నగర్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల్లో అవినీతి వ్యతిరేక భావజాలాన్ని పెంచాలి


యాంటీ కరప్షన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

### అవినీతిని నిర్మూలించడం కోసం ప్రతి పౌరుడు ముందుకు రావాలి

### సమాజంలో అవినీతినీ ఎదిరించేందుకు సొంత ధైర్యం, సొంత నిబద్ధత అవసరం

### సూరారం లూయిస్ బ్రెల్ భవన్‌లో యాంటీ కరప్షన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, నవంబర్ 11 (ప్రభాత ఉదయం)

సూరారం లూయిస్ బ్రెల్ భవన్‌లో యాంటీ కరప్షన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్ర కొత్త కమిటీ ఏర్పాటుతో పాటు ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నేషనల్ డైరెక్టర్ ఉప్పు సంజీవరావు, నేషనల్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డీ, తెలంగాణ చైర్మన్ ఇన్నా రెడ్డి, వైస్ చైర్మన్, స్టేట్ సెక్రటరీ, స్టేట్ కోఆర్డినేటర్స్, స్టేట్ ఇంచార్జ్‌లు, జిల్లా ప్రెసిడెంట్లు, జిల్లా కోఆర్డినేటర్లు , సంస్థకు చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు.

నూతన కమిటీ సభ్యులకు అధికారికంగా నియామక పత్రాలు అందజేసిన అనంతరం, వారు తమ బాధ్యతలను స్వీకరిస్తూ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రజల్లో అవినీతి వ్యతిరేక భావజాలాన్ని పెంచి, పారదర్శక పాలన కోసం పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వక్తలు ప్రస్తావించారు.

నేషనల్ డైరెక్టర్ ఉప్పు సంజీవరావు మాట్లాడుతూ...

"అవినీతి దేశ అభివృద్ధికి అతిపెద్ద అడ్డంకి. ప్రజాస్వామ్య బలహీనతకు కారణమయ్యే ఈ అవినీతిని నిర్మూలించడం కోసం ప్రతి పౌరుడు ముందుకు రావాలి. యువతలో నైతిక విలువలను పెంచి, అవినీతి రహిత తెలంగాణ నిర్మాణం మా ప్రధాన లక్ష్యం. ప్రతి మండలం, జిల్లా స్థాయిలో యాంటి కరప్షన్ కార్యకర్తలను ఏర్పాటు చేసి, అవగాహన కార్యక్రమాలు చేపడతాం" అని తెలిపారు.

ఇక రాష్ట్ర చైర్మన్ మాట్లాడుతూ..."సమాజంలో అవినీతి ఎదిరించేందుకు సొంత ధైర్యం, సొంత నిబద్ధత అవసరం. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మా కర్తవ్యమని" అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ సెక్రటరీ, మాట్లాడుతూ అవినీతి నిరోధక చట్టాలపై అవగాహన పెంచడం, ప్రభుత్వ సేవలలో పారదర్శకతను సాధించడం, ప్రజా సమస్యలను న్యాయబద్ధంగా పరిష్కరించడం వంటి అంశాలపై దృష్టిపెట్టనున్నట్లు వెల్లడించారు. నూతన కమిటీ సభ్యులు సంస్థ లక్ష్యాలను పాటిస్తూ బాధ్యతగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు, నాయకులు ఒకరికొకరు అభినందనలు తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


నూతన కమిటీని సన్మానిస్తున్న సభ్యులు


ప్రజా బాట కార్యక్రమంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను పరిశీలిస్తున్న ఏడిఈ రాజేష్


ప్రజా బాటలో పాల్గొన్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

## విద్యుత్ వినియోగదారులు మెరుగైన సేవలు అందించడమే ప్రజాబాట లక్ష్యం: ఏడీఈ రాజేష్

చేవెళ్ల, నవంబర్ 11(ప్రభాత ఉదయం) విద్యుత్ వినియోగదారుల సమస్యలు సత్వరమే పరిష్కరించడమే ప్రజాబాట ప్రధాన ఉద్దేశమని చేవెళ్ల విద్యుత్ సబ్ డివిజన్ ఏ డి ఈ రాజేష్ తెలిపారు. మంగళవారం విద్యుత్ సంస్థ చేపట్టిన ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా అసిస్టెంట్ ఇంజనీర్ రాజేందర్, లైన్ ఇన్స్పెక్టర్లు, లైన్ మాన్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడిఈ రాజేష్ మాట్లాడుతూ... వినియోగదారులు విద్యుత్ సమసవినియోగదారులుదృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఇండ్ల మధ్య ఇబ్బందిగా ఉన్న స్తంభాలు, విద్యుత్ తీగలు కిందికి వేలాడటం, సరఫరా లో అంతరాయం, హెచ్చుతగ్గులు వంటి సమస్యలు క్షేత్రస్థాయిలో సిబ్బంది పరిశీలించి సరిదిద్దుతారన్నారు. విద్యుత్ బిల్లులను వినియోగదారులు సకాలంలో చెల్లించి సంస్థ అభ్యున్నతికి తోడ్పాటు అందించాలన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నాణ్యమైన, నిరంతర విద్యుత్తు అందించటానికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళుతుందని అందుకు వినియోగదారులు సహకరించాలన్నారు.

## ఈ నెల 13న వ్యవసాయ వర్శిటీ, వెస్టర్న్ సిడ్నీ వర్శిటీ లు సంయుక్తంగా నిర్వహిస్తున్న డ్యూయల్ డిగ్రీ కోర్సులలో ప్రవేశాలకు వాక్ ఇన్ కౌన్సిలింగ్



బుద్వేల్, నవంబరు 11 (ప్రభాత ఉదయం) : ఈ నెల 13వ తేదీ గురువారం ఉదయం 10 గం టలకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వెస్టర్న్ సిడ్నీ యూనివర్శిటీ లు సంయుక్తంగా అందిస్తున్న డ్యూయల్ డిగ్రీ బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశాల కోసం వాక్ ఇన్ కౌన్సిలింగ్ ను నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఎస్ఆర్ఎ/ ఎన్ఆర్ ఐ ప్రాయోజిత కోటా బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ), బీటెక్ (అగ్రికల్చర్ ఇంజనీరింగ్), బీఎస్సీ (హానర్స్) కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో సీట్ల భర్తీకి వాక్ ఇన్ కౌన్సిలింగ్ జరుగనుందని రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. ఈ రెండు కౌన్సిలింగ్ లు రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ నేచురల్ రీసోర్సెస్ అండ్ ఎన్విరాన్మెంట్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ ధృవపత్రాలు, వెబ్ సైట్ లో పేర్కొన్న రుసుముతో కౌన్సిలింగ్ కు హాజరుకావాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ www.pjtau.edu.in లో చూడవచ్చని రిజిస్ట్రార్ తెలిపారు.


విద్యుత్1104 యూనియన్ రీజినల్ కమిటీ మొదటి సమావేశం లో పాల్గొన్న ప్రతినిధులు

## విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడమే 1104 యూనియన్ లక్ష్యంగా పనిచేస్తుంది:

### విద్యుత్ 1104 ఉద్యోగుల సంఘం సర్కిల్ అధ్యక్షులు బాబురావు

రాజేంద్రనగర్, నవంబర్ 11(ప్రభాత ఉదయం) విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా 1104 యూనియన్ పనిచేస్తుందని సర్కిల్ యూనియన్ అధ్యక్షులు బాబురావు అన్నారు. మంగళవారం

రాజేంద్రనగర్ సర్కిల్ రీజినల్ ఎగ్జిగూటివ్ మొదటి సర్వ సభ్య సమావేశ కార్యక్రమం లో పలు సమస్య లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో

రాజేంద్ర నగర్ సర్కిల్ అధ్యక్షులు బాబు రావు మాట్లాడుతూ... యాజమాన్యం ఆదేశానుసారం ఉద్యోగులు పనిచేస్తున్నారని ఉద్యోగుల సమస్యలు మేనేజ్మెంట్ సానుకూల దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ సర్కిల్ రీజినల్ సెక్రటరీ యూనియన్ లక్ష్మి నారాయణ గౌడ్ , వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ,, శ్రీనివాస్ , అడిషనల్ సెక్రటరీ బాషు నాయక్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కంపెనీ కార్యవర్గ సభ్యులు , నూతనంగా బాధ్యత తీసుకున్న మెంబెర్స్ బాడీ, షాదనగర్, కందుకూరు, రాజేంద్రనగర్ మరియు సర్కిల్ యూనిట్, ఎం ఆర్ టి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు,కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


## పాఠశాలలను శుభ్రంగా, సురక్షితంగా, బాలికలకు అనుకూలంగా తీర్చిదిద్దడం అందరి బాధ్యత

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్11(ప్రభాత ఉదయం)పాఠశాలలను శుభ్రంగా, సురక్షితంగా, బాలికలకు అనుకూలంగా తీర్చిదిద్దడం అందరి బాధ్యత అని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు పేర్కొన్నారు.

మంగళవారం జిల్లా కేంద్రంలోని వజ్ర ఫంక్షన్ హాల్‌లో డిఆర్డిఏ యూనిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిశోర బాలికల సమస్యలు , పాఠశాలలలో పరిశుభ్రత, మంచినీటి ఏర్పాట్లు, హై జెన్ అంశాలపై అవగాహన సమావేశంలో అదనపు కలెక్టర్ బి. నర్సింగరావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా యూనిసెఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 94 పాఠశాలల వాష్ సర్వే నివేదికను విడుదల చేశారు. నరసింహారెడ్డి సర్వే వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. నర్సింగరావు మాట్లాడుతూ... బాలికల విద్యా ప్రగతి కోసం పాఠశాలల్లో పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, శౌచాలయాల నిర్వహణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. బాలికల కోసం ప్రత్యేక శౌచాలయాలు మరియు హైజిన్ సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో హైజిన్‌పై విద్యార్థులలో అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు నెలనెలా పాఠశాల పరిశుభ్రత, నీటి వనరుల పరిస్థితిపై సమీక్ష చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ నేషనల్ ఆఫీసర్ మురళీకృష్ణ , ప్రతినిధులు ఏ. వెంకటేష్,మెరీ జోన్స్,అదనపు డిఆర్డిఓ శ్రీనివాస్,జిల్లా విద్యా అధికారి విజయలక్ష్మి,మిషన్ భగీరథ ఈ.ఈ శ్రీధర్ రెడ్డి,జిల్లా ఆసుపత్రి నుండి డాక్టర్ ప్రసూన,ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.





దొంగ తనం జరిగిన పి జీ ఆర్ అపార్ట్మెంట్

## తాళం వేసిన ఇంట్లో చోరీ

బుద్వేల్, నవంబరు 11 (ప్రభాత ఉదయం) : హైదర్‌రీడ జీపీఆర్ ఆర్కిడ్ అపార్ట్మెంట్ లోని 4వ అంతస్థులో దొంగలు పడ్డారు. తాళం వేసిన ఇల్లును టార్గెట్ చేసిన దొంగలు ఇంటి యజమాని పనికి వెళ్లడం, అతని భార్య తాళం వేసి బయటకు వెళ్లి వచ్చే సరికి ఇల్లు గుల్ల చేశారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.... హైదర్ గూడ పీజీఆర్ బిల్డింగ్స్ లోని 4వ అంతస్థులో శ్రీనాధ్ కుటుంబం నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం శ్రీనాధ్ పనికి వెళ్లారు. ఆయన భార్య మద్యాహ్నం ఒంటి గంటలకు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లింది. నాలుగు గంటలకు ఆమె తిరిగి ఇంటికి రాగా ఇంటి తాళాలు పగులగొట్టిన దొంగలు లోనికి వెళ్లి బీరువా లో ఉన్న 13 తులాల బంగారం దోచుకెళ్లారు. దీంతో లబోదిబో మన్న బాధితురాలు రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూటీమ్ ను రప్పించి వేలిముద్రలు తీసుకున్నారు.

## బ్రాహ్మణులు, బ్రాహ్మణ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో విరివిగా సామాజిక కార్యక్రమాలు:

### ఆచార్య కాకునూరి సూర్య నారాయణ మూర్తి


సమావేశంలో పాల్గొన్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

చార్మినార్, నవంబర్ 11(ప్రభాత ఉదయం): సామాజిక సేవా కార్యక్రమాలను విరివిగా నిర్వహించేందుకు బ్రాహ్మణులు, బ్రాహ్మణ స్వచ్ఛంద సంస్థలు మరింతగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ ఆచార్య కాకునూరి సూర్య నారాయణ మూర్తి పిలుపునిచ్చారు. దక్షిణ భారత కాన్యకుబ్జ్ బ్రాహ్మణ సభ ఆధ్వర్యంలో ఉప్పుగూడ లోని కాన్యకుబ్జ్ భవన్ లో దీపావళి సమ్మేళనం జరిగింది. గత 45 ఏళ్లకు పైగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న 15 మంది బ్రాహ్మణులను ఘనంగా సత్కరించారు.


సన్మానం చేస్తున్న సంఘం ప్రతినిధులు

ప్రశంసా పత్రాలను అందజేసి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య కాకునూరి సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో ఇప్పటికే బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన పలువురు అధికార, అనధికార ప్రముఖులు చురుకుగా పాల్గొంటున్నారన్నారు. సమాజం లోని అట్టడుగు వర్గాల ప్రజలకు అవసరమైన సహాయ, సహకారాలను అందజేయడానికి మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులను సైతం విద్య, వైద్య, ఆర్థిక రంగాల్లో నిడదొక్కుకునే విధంగా సహకారంఅందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ భారత కాన్యకుబ్జ్ బ్రాహ్మణ సభ అధ్యక్షులు రామ్ కుమార్ తివారి, ఉపాధ్యక్షులు రాకేశ్ తివారి, ప్రధాన కార్యదర్శి విజయ్ పాల్ పాండే, సంయుక్త కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, కోశాధికారి గోపాల్ శుక్ల తదితరులు పాల్గొన్నారు. అనంతరం సహా ఫంక్తి భోజనాలు చేశారు.

# మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ



సమావేశంలో నిందితులు వివరాలు వెల్లడిస్తున్న ఎస్ పి శ్రీనివాసరావు



నిందితుడి నుండి స్వాధీనం చేసుకున్న నగదు, సెల్ ఫోన్

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్11(ప్రభాత ఉదయం) ఆన్ లైన్ బెట్టింగ్ లకు బానిసై, చేసిన అప్పులు కట్టలేక అక్రమ మార్గాన డబ్బులు సంపాదించాలనే అత్యాసతో ఓ మహిళను హత్య చేసి, బంగారు పుస్తెలతాడు, ఆభరణాలు, పట్టీలు, కడాలు, ఎత్తుకెళ్లిన కేసులో ప్రధాన నిందుతుడి ని గద్వాల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నినుంచి రూ.2,35,000, ఒక వాహనం, ఐఫోన్ స్వాధీనం చేసుకున్నారు. గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శేరెల్లివీధిలో బలిజ లక్ష్మీ హత్య కేసులో ప్రధాన నిందితుడు రాంరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ టి.శ్రీనివాస్ రావు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

### అప్పు ఇవ్వాలని ఒత్తిడి...

శేరెల్లివీదిలో నివసిస్తున్న బలిజ లక్ష్మీ, మల్లికార్జున గౌడలు చిరు వ్యాపారం నిర్వహిస్తున్నారు. ధరూర్ మండలం గార్లపాడు గ్రామానికి చెందిన కల్లా శ్రీనివాస్ రెడ్డి గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డులో కమీషన్ మర్చంట్ గా నిర్వహిస్తున్నాడు. శ్రీనివాస్ రెడ్డి కుమారుడు కల్లా రాంరెడ్డి షేరెల్లి వీదిలో గల తన పెద్దనాన్న ఇంట్లో నివాసముంటున్న బలిజ లక్ష్మీతో పరిచయం ఏర్పడింది. రాంరెడ్డి బెట్టింగ్ అలవాటు పడి తన భార్య బంగారం ఆభరణాలు తీసుకుని ఆన్ లైన్ గేమ్ లు ఆడి అప్పుల పాలయ్యాడు. ఇదే క్రమంలో వడ్డీల వ్యాపారం నిర్వహిస్తున్న బలిజ లక్ష్మీ ని కొంత డబ్బులు అప్పు ఇవ్వమని ఒత్తిడి తీసుకవచ్చాడు. ఈనెల 2న ఆదివారం లక్ష్మీ ఇంటికి వెళ్లి మరోసారి అప్పు ఇవ్వాలని కోరాడు. తన దగ్గర డబ్బులు లేవని, ఇవ్వలేని చెప్పడంతో లక్ష్మీని పథకం ప్రకారం వెనుకకు నెట్టి గొంతు నులిమి హత్య చేశాడు. ఆమె మృతి చెందినట్లు నిర్ధారించుకున్న తర్వాత ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. కొద్ది సేపటికి మృతురాలి భర్త మల్లికార్జున్ ఇంటికి రాగ తలుపు తెరిచి ఉండటాని గమనించి తన భార్య మృతి చెందినట్లు గుర్తించారు. ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్లు, బంగారం కోసమే హత్య చేసిఉంటారని బాధితుడు గద్వాల టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడు గుర్తింపు

మృతురాలి భర్త మల్లికార్జున్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు గద్వాల డీఎస్పీ వై.మొగులయ్య పర్యవేక్షణలో గద్వాల సీఐ టి.శ్రీను ఆధ్వర్యంలో గద్వాల టౌన్ ఎస్ఐ కళ్యాణ్ కుమార్, గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, మల్దకల్ ఎస్ఐ నందీకర్, పోలీస్ సిబ్బంది మృతురాలి లక్ష్మీతో సంబందాలున్న ప్రతి ఒక్కరిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలో సీసీ ఫుటేజ్ ఆధారంగా మంగళవారం ఉదయం ప్రధాన నిందితుడు రామిరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. మృతురాలు ఇంటికి , మృతురాలి భర్త షాప్ దగ్గరకు వెళ్ళి నట్లు సిసిటివి ఫూటేజ్ ఆదారంగా నిర్ధారణ కాగా, నేరస్తుడే నేరం చేసి మృతురాలిని డబ్బులు అడిగినట్లు, మృతురాలి ఇంటిలోకి వెళ్లి వచ్చినట్లు దర్యాప్తులో తేలింది.

దొంగిలించన పుస్తెలతాడు బంగారు బిస్కెట్ గా మార్చి

మృతురాలి హత్య చేసి ఆమె బంగారు పుస్తెలతాడు, పట్టీలు, కడాలు దొంగిలించిన నిందితుడి తన చిన్ననాటి స్నేహితుడైన ఉమేష్ కు సంబంధించిన శంషాబాద్ లో గోల్డ్ షాప్ లో కరిగించి బిస్కెట్ గా మార్పించాడు. ఆ బిస్కెట్ బంగారాన్ని హైదరాబాద్ లోని ఉప్పరగూడలో ఓ గోల్డ్ దుకాణంలో విక్రయించగా రూ.5 లక్షల 60 వేలు వచ్చాయి. వచ్చిన డబ్బులో కొంత డబ్బును తన ఖర్చులకు వాడుకొని భార్యకు ఇయర్ రింగ్స్ చేయించి, కొత్త బట్టలు తీసుకున్నాడు. మిగిలిన 1.33 లక్షల రూపాయలను తన స్కూటీలో పెట్టుకున్నాడు. తన ఫ్రెండ్స్ దగ్గర తీసుకున్న లక్ష ఇరవై వేల రూపాయలను అప్పు కట్టేశాడు. తాకట్టులో ఉన్న తన భార్య బంగారాన్ని విడిపించేందుకు 1.65 లక్షలు కట్టాడు.

### కేసు ఛేదించిన పోలీసులకు రివార్డులు : ఎస్పీ

ఎలాంటి ఆధారాలు లభించలేని మర్డర్ కేసును ఛేదించడంలో కృషి చేసిన గద్వాల సర్కిల్ పోలీసులను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస్ రావు అభినందించారు. ఈ సందర్భంగా ఈ కేసును ఛేదించడం లో ప్రతిభ చూపిన పట్టణ ఎస్ఐ కళ్యాణ్ కుమార్, గద్వాల్ టౌన్ ఎస్ఐ -2 సతీష్ రెడ్డి, గద్వాల రూరల్ ఎస్ఐ శ్రీకాంత్, మల్దకల్ ఎస్ఐ నందీకర్, ధరూర్ శ్రీహరి, కానిస్టేబుల్ చంద్రయ్య, కిరణ్, రామకృష్ణ, వీరేశ్ లకు రివార్డులు ఇచ్చి జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినధించారు.

# ఆదివాసీ యువత ప్రపంచాన్ని తెలుసుకోవాలి : మధుయాష్కీగౌడ్



ఆదివాసి యువ సమ్మేళనాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్

బుద్వేల్, నవంబరు 11 (ప్రభాత ఉదయం) : ఆదివాసీ గ్రామాల నుంచి వచ్చిన యువత తాము ఎంచుకున్న లక్ష్యం వైపు పట్టుదలతో కృషి చేసి ఉన్నత స్థానాలకు ఎదగాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ సౌజన్యంతో మేరా యువ భారత్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు రాజేంద్రనగర్ లో జరుగనున్న 17వ ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం ను (అదివాసీ యువత సమ్మేళనం) ను మం గళవారం ఆయన ప్రారంభించారు. ఈ సమ్మేళనంలో చత్తీస్ ఘడ్ ఒడిస్సా, ఝార్కండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఆదివాసీ యువత హాజరైనారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ, యువత ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్ లు కావాలన్న లక్ష్యాలే కాకుండ రాజకీయాలలోను రావాలన్నారు. ఆదివాసీ యువతకు రాజ్యాంగం రిజర్వేషన్ కల్పించిందని, మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కూడా అమలు కానున్నాయని, గ్రామ సర్పంచ్ నుంచి ఎంపీ వరకు పోటీ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే చాలా ఆదివాసీ గ్రామాలలో ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, బస్సు, రోడ్డు సదుపాయాలు లేకపోవడం భాదాకరమన్నారు. దేశ నిర్మాణంలో ఆదివాసీల పాత్ర ఎంతో ఉందని, వారి శ్రమకు సరిపడా సంపద దక్కడం లేదన్నారు. సామాజిక, ఆర్థిక, అసమానతల వల్ల నక్సలిజం వైపు ఆ ప్రాంతాల యువత వెళుతున్నారన్నారు. అందుకే చత్తీస్ఘడ్ ఒడిస్సా, ఝార్కండ్ రాష్ట్రాలలో ఆదీవాసీలకు సంపదలో వాటా దక్కాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆదివాసీ యువత గ్రామ స్థాయిలోనే అగిపోకుండ ప్రపంచాన్ని చుట్టిరావాలన్నారు. తమ ఎదుగుదలతో పాటు తాము పుట్టి పెరిగిన ప్రాంతాలను అన్ని రంగాలలో అభివృద్ధి వైపు నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అజయ్ మిశ్రా, మేరా యువ భారత్ సేట్ డైరెక్టర్ అన్షుమాన్ ప్రసాద్, పి.వైద్య నాథ్ రావు, కుష్బూ గుప్తా, సైదా నాయక్‌లు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న ఆదివాసి యువత

# ముగిసిన సీఐటీయూ రంగారెడ్డి జిల్లా 4వ మహా సభలు



సీఐటీయూ రంగారెడ్డి జిల్లా 4వ మహా సభలలో మాట్లాడుతున్న నాయకులు



జె రుద్ర కుమార్

బుద్వేల్, నవంబరు 11 (ప్రభాత ఉదయం) : కాటేదాన్ లో రెండు రోజుల పాటు నిర్వహించిన సీఐటీయు రంగారెడ్డి జిల్లా 4వ మహ సభలు మంగళవారం ముగిసాయి. టీఎల్ఎం గార్డెన్ లో జరిగిన ప్రతినిధుల సభలో సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, కార్యదర్శి కూరపాటి రమేశ్ లు ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రసంగిం చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలలపై నిరంతరం చైతన్యవంతంతో పోరాడాల్సిన ఆసవరం ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల, ప్రజల సంపద ను కార్పోరేట్ పెట్టుబడీదారీ సంస్థలకు అమ్మివేస్తుందని ఆరోపించారు. రోడ్లు, బొగ్గు, రైల్వే, ఓడరేవులు, ఎయిర్ ఫోర్స్ వంటి ప్రభుత్వ పరిశ్రమలను ప్రైవేటు పరం చేసు బిన్నారన్నారు. వాటిపై కార్మిక వర్గాలు చైతన్యమై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు.



### నూతన కమిటీ

సీఐటీయు రంగారెడ్డి జిల్లా నూతన అధ్యక్షునిగా రాజేంద్రనగర్ సర్కిల్ కు చెందిన జె రుద్రకుమార్ ఎంపికైనారు. కార్యదర్శిగా చంద్రమోహన్, ఉపాధ్యక్షులుగా ఎస్ రామ్మోహన్ రావు, డి.కిషన్, ఎన్ రాజు, డి.జగదీశ్, మల్లెపాక వీరయ్య, పెంటయ్య. సహాయక కార్యదర్శులుగా స్వప్న, అల్లి దేవేందర్, ఎల్లయ్య, సీహెచ్ మల్లేశ్, నాట్కో మల్లేశ్, ఎల్లయ్య తో పాటు కమిటీ ని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ లో 51 మందికి అవకాశం కల్పించారు. కార్యక్రమంలో భాస్కర్, స్వామి. కాలే రాజు. వెంకటయ్య, చుక్క మోహన్ లు పాల్గొన్నారు.



ఆలయ సన్నిధిలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దంపతులు

# చింతరేవుల అంజన్న స్వామివారి సన్నిధిలో మంత్రాలయ ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి దంపతులు

గద్వాల జిల్లా ప్రతినిధి(ధరూర్), నవంబర్ 11(ప్రభాత ఉదయం) ధరూర్ మండలం పెద్ద చింతరేవుల గ్రామంలో వెలిసిన శ్రీ ఆంజనేయ స్వామి వారిని మంగళవారం మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి , స్వయంభు మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు వారిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సి.గిరిరావు, ప్రధాన అర్చకులు భీంసేన చారి జోషీ, ఆలయాల డివిజన్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఆలయ ఈఓ సి.కవిత, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో టెంకాయల వేలం

ధరూర్, నవంబర్11(ప్రభాత ఉదయం)ధరూర్ మండలం పెద్ద చింతరేవుల గ్రామంలో వెలిసిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం దేవస్థానం అధికారుల సమక్షంలో టెంకాయల విక్రయానికి టెండర్ నిర్వహించారు. 2026 సంవత్సరానికి గాను నిర్వహించిన టెంకాయల వేలం పాటలో నలుగురు డిపాజిట్ దారులు పాల్గొన్నారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన యశ్వంత్ రూ 4,10,000 టెంకాయల విక్రయం టెండర్‌ను దక్కించుకున్నాడు. కొబ్బరి చిప్పల సేకరణకు సంబంధించి నలుగురు పోటీదారులు డిపాజిట్లు చెల్లించివేలం పాటలో పాల్గొనగా జమ్మిచేడు గ్రామానికి చెందిన ఎం.గోపాల్ రూ1,34,000 దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సి.గిరిరావు, ఆలయాల డివిజన్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ, ఆలయ ఈఓ సి.కవిత, ఆలయ సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# బాలల సంక్షేమం అందరి బాధ్యత:శివలీల

ధరూర్, నవంబర్ 11 (ప్రభాత ఉదయం)బాలల సంక్షేమం అందరి బాధ్యత అని 1098 కోఆర్డినేటర్ శివలీల అన్నారు. మంగళవారం ధరూర్ మండలం మన్నాపురం మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ 1098 చైల్డ్ హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో బాలల సంక్షేమంపై గ్రామ స్థాయి బాలల పరిరక్షణ కమిటీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ శివలీల మాట్లాడుతూ గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ నెలలో ప్రతి రెండవ మంగళవారం నిర్వహించడం జరుగుతుందన్నారు .గ్రామాలలో బాలల యొక్క సమస్యలపై కమిటీలోని సభ్యులందరూ చర్చించడం జరుగుతుందని, అలాగే బాలల సంక్షేమం కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098 అను టోల్ ఫ్రీ నెంబర్ దేశవ్యాప్తంగా పనిచేస్తుందని, 24 గంటలు సేవలు అందించే ఉచిత హెల్ప్ లైన్ నెంబర్ అని వివరించారు. పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలని ఆకాంక్షించారు. ఆడపిల్లలపై సోదరభావంతో ఉండాలని అన్నారు. బాలల సమస్యల పరిష్కా రం కోసం డయల్ 100, 1098కి ఫోన్ చేయాలని సూచించారు. చిన్న వయస్సులో పెళ్లిళ్లు చేయడం నేరమని, అలాంటి సమాచారం తమకు అందించాలని ఆమె కోరారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, మొబైల్ ఫోన్ వారి చేతికి ఇచ్చినట్లయితే దాని ద్వారా పిల్లలు చాలా ప్రమాదాలు ఎదుర్కోవడం జరుగుతుందన్నారు. బాల కార్మికులు గా ఎవరైనా పనిచేస్తున్న కూడా ఆ పిల్లలను రిస్క్యూ చేసి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరచడం జరుగుతుందన్నారు. బాల కార్మిక నిషేధ చట్ట ప్రకారం పనిలో ఉంచుకున్న యజమాని మరియు తల్లిదండ్రులపై కేసు నమోదు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐ సి డి స్ సూపర్వైసర్ సునీతమ్మ, పంచాయతీ కార్యదర్శి, స్కూల్ టీచర్ , అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608